క్లుప్తంగా

కాలువలపై నిర్మాణాలు వద్దు

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య



కాలువలపై ఉన్న పలకలను జేసీబీతో తొలగించి చెత్తా, చెదారాలను తీస్తున్న దృశ్యం

విజయనగరం: కాలువలపై ఉన్న పలకలను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలు చేపట్ట వద్దని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. అనేక ప్రాంతాలలో కాలువలపై ఉన్న పలకలను ఆక్రమించి మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టడాన్ని ఆయన బుధవారం గమనించారు. దీనివల్ల కాలువలను శుభ్రం చేసే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బాబామెట్ట ప్రాంతంలో జేసీబీ సహాయంతో పలకలను తొలగించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారాలను తొలగించారు.

నియామకం..



జనార్ధనరావు

పూసపాటిరేగ: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా మహంతి జనార్ధనరావును నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనార్ధనరావు భార్య మహంతి సీతాలక్ష్మి పూసపాటిరేగ జెడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్నారు. ఈయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సందర్శన



బజాజ్ షోరూమ్ వద్ద విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో గల బజాజ్ షోరూమ్‌ను పరిశ్రమల సందర్శనలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకరరావు మాట్లాడుతూ.. పరిశ్రమల సందర్శన వల్ల విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 9,10వ తరగతి విద్యార్థులతో ప్రదర్శనల సందర్శన చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీడీ బాబ్జీతో పాటు ఒకేషనల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యసేవలపై ఆరా



రాకోడు ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు పీహెచ్‌సీని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి జీవనరాణి బుధవారం సందర్శించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న లేబరేటరీ భవనాలను పరిశీలించారు. అలాగే రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రతి నెలా ఇస్తున్న లక్ష్యం ప్రకారం ప్రసవాలు చేస్తున్నారా, లేదా అని వైద్యురాలు శ్రావణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పినవేమలి గ్రామంలో జరుగుతున్న ఎస్‌సీడీసీ, ఎన్‌సీడీ వంద రోజుల టీబీ ప్రోగ్రాంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే కుక్క, పాముకాటుకు సంబంధించి వ్యాక్సిన్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గర్భిణులకు మెరుగైన సదుపాయాలతో పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిపిస్తున్నట్లు తెలిపారు. పర్యవేక్షణలో ఆమెతో పాటు ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

3న ఎన్నికల నోటిఫికేషన్

నెల్లిమర్ల: ఫిబ్రవరి 3న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదలవుతుందని తహసీల్దార్ పి. సుదర్శనరావు, ఎన్నికల డీటీ వీవీఆర్ జగన్నాథరావు తెలిపారు. బుధవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికకు ఎన్నికల సంఘం సానుకూలంగా ఉందన్నారు. వచ్చేనెల 3న నోటిఫికేషన్ జారీ, అదేనెల 27 ఎన్నిక, మార్చి 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట ఉపాధిహామీ క్షేత్ర సహాయకురాలిగా పనిచేస్తున్న కొండమ్మను విధుల నుంచి తొలగిస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేశారని ఏపీఓ అరుణ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండమ్మ కొన్ని నెలల నుంచి విధులకు గైర్హాజరు అవుతున్న కారణంగా ఆమెను తొలగిస్తూ పీడీ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఆమెకు నోటీసులు అందజేశామని తెలిపారు.

వీరు మారరంతే..



కలెక్టరేట్ రోడ్డులో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారుడు

అదే నిర్లక్ష్యం.. కొనసాగుతూనే ఉంది.. పోలీసులు ఓ పక్క.. ఆర్టీఓ అధికారులు మరోపక్క ఎప్పటికప్పుడు దాడులు చేపడుతున్నా.. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా వాహన చోదకుల్లో ఇంకా మార్పు రాకపోవడం శోచనీయం.. కాస్త నిర్లక్ష్యానికే విలువైన ప్రాణాలు కోల్పోతున్న ప్రమాదాలు కళ్లముందే ఎన్నో జరుగుతున్నాయి.. కాని వాహన చోదకుల్లో మార్పు రావడం లేదు.. సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ఓవర్ లోడ్‌తో రాకపోకలు, సిగ్నల్స్ పాటించకపోవడం నిత్యం జరుగుతూనే ఉన్నాయి.. పట్టణంలో పలువురు వాహన చోదకులు నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగించడం బుధవారం సాక్షి కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం





గుంకలాం బైపాస్ రోడ్డులో ఓవర్ లోడ్‌తో క్రాస్ చేస్తున్న వాహనాలు



గుంకలాం బైపాస్ రోడ్డులో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో



గజపతినగరం రోడ్డులో పాసింజర్ ఆటోలో ఓవర్ లోడ్

అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ

పూసపాటిరేగ: అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండలంలోని అల్లాడపాలెంలో కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వ్యవస్థ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్లను గ్రేడ్ 4, 3 ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయికులు శ్రీలక్ష్మి, ఉమా, రాధ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం



కోలాటం ఆడుతున్న మహిళలు



బంగారమ్మ ఆలయం

డెంకాడ: మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో వార్షికోత్సవం సందడిగా మారింది.

అలసత్వం వహిస్తే చర్యలు

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ త్రినాథ



పిల్లల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న త్రినాథ

విజయనగరం ఫోర్ట్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.త్రినాథ హెచ్చరించారు. పట్టణంలోని పోలయ్యపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, స్టాక్ వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉదయం 9 గంటల కల్లా పిల్లల హాజరు వేయాలన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

సత్య విద్యాసంస్థల విద్యార్థులకు పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు

విజయనగరం అర్బన్: సత్య విద్యాసంస్థలకు చెందిన సీతం ఇంజినీరింగ్ కళాశాల, డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఉత్తమ వార్షిక ప్రతిభ కనపరిచిన పలువురికి ఆ సంస్థ సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి నగదు పురస్కారాలను బుధవారం అందజేశారు. 'మజ్జి రామారావు, బొత్స గురునాయుడు' మెమోరియల్ మెరిట్ స్కాలర్‌షిప్ రూపంలో రూ.5 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం పీహెచ్‌డీలు, ఇతర విద్యార్హతలు పూర్తిచేసిన అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ డీ వీ రామమూర్తి, డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు

నెల్లిమర్ల: పట్టణ ప్రాంతంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకుడు ఎం. పాపారావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నెల్లిమర్ల పట్టణ ప్రాంతంలో 30 ఏళ్ల నుంచి పేదలు సొంత స్థలాల్లేక ఎన్నో ఇబ్బందుల నడుమ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు మంజూరైనా నివాసయోగ్యం కావని చెబుతూ వెళ్లడానికి నిరాకరించారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం వారికి అనువైన ప్రాంతంలో స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ



వసతిగృహం పరిశీలిస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి, ఎంపీడీఓ గాయత్రి, తదితరులు

పూసపాటిరేగ: భోగాపురం మండలం రావాడ బీసీ సంక్షేమ వసతిగృహాన్ని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మెనూ, ఇతర మౌలిక వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వసతిగృహ సంక్షేమాధికారి అప్పలకొండను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఎంపీడీఓ గాయత్రి, వైఎస్సార్‌సీపీ భోగాపురం మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, సర్పంచ్ అప్పరభుక్త పైడినాయుడు, సూరిబాబు, తదితరులున్నారు.

బోనస్ చెల్లింపు

నెల్లిమర్ల: కార్మిక సంఘాల ఒత్తిడి మేరకు స్థానిక జూట్‌మిల్లు యాజమాన్యం కార్మికులకు బోనస్ చెల్లించిందని జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 సంవత్సరానికి చెందిన బోనస్ చెల్లించినట్లు పేర్కొన్నారు. కార్మిక సంఘాల ఐకమత్యంతో బోనస్ సాధించామని, ఇదే స్ఫూర్తితో మిల్లు తెరిపించేందుకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

మార్చి 8న జాతీయ మెగాలోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. స్థానిక కోర్టులో న్యాయవాదులతో బుధవారం సమీక్ష జరిపారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసుల సత్వర న్యాయానికి లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సివిల్,క్రిమినల్, తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చని, ప్రతీ న్యాయవాది తమపరిధిలో ఉన్న కక్షిదారులను పిలిచి వారితో మాట్లాడి లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో కేసులుపరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

• పరిశీలన..



భోగాపురం మండలంలోని ముంజేరు అప్రోచ్ రోడ్‌ను ఆర్డీఓ దాట్ల కీర్తి బుధవారం పరిశీలించారు. ఎయిర్‌పోర్టుకు అవసరమైన రహదారి నిర్మాణంపై గ్రామానికి చెందిన రైతులతో మాట్లాడారు. రహదారికి కావాల్సిన భూసేకరణ, తదితర విషయాలపై చర్చించారు. ఆమెతో పాటు జీఎంఆర్ సిబ్బంది, ఎయిర్‌పోర్టు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– పూసపాటిరేగ

• సైబర్ నేరాలపై అప్రమత్తం



సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ తానే అనిత అన్నారు. ఏజీఎల్ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాలు, గృహహింస, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేకే మహేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

• వెలుగుల తోరణం..



విజయనగరం జిల్లా కేంద్రంలోని రామారాయుడు రోడ్డులో విద్యుత్ ధగధగల మధ్య జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం కాంతులీనుతోంది. రంగు రంగుల విద్యుత్ బల్బుల నడుమ ఉన్న గాంధీ విగ్రహం చూపరులను ఆకట్టుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

• క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన..



నెల్లిమర్ల మండలం జరజాపుపేటలో క్షయవ్యాధి నిర్మూలనపై బుధవారం అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని పూర్తిస్థాయిలో నివారించవచ్చని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. క్షయవ్యాధిని నిర్మూలిస్తామని సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వీరాస్వామి, శ్రీను, అచ్చియమ్మ, తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల

అనధికార హోర్డింగ్‌లకు అనుమతి లేదు

- నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



అనధికార బడ్డీలను తొలగిస్తున్న నగరపాలక సంస్థ ప్రణాళిక సిబ్బంది

విజయనగరం: అనధికార హోర్డింగులు, ప్రకటన బోర్డులను అనుమతించబోమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. రహదారులను ఆక్రమించి, రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసిన హోర్డింగులను కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది బుధవారం తొలగించారు. ఎస్.కోట వెళ్లే రహదారి, అయ్యన్నపేట ప్రాంతాలలో అక్కడక్కడా ఏర్పాటు చేసిన బోర్డులను తీసేశారు. అలాగే రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను కూడా తొలగించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలని, లేనిపక్షంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



సామాదుల సంతోష్



జరజాపు ఫణీంద్ర

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైనట్లు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామానికి చెందిన సామాదుల సంతోష్‌కుమార్ ఈ నెల 26న కుటుంబ సభ్యులతో కలిసి విజయనగరంలోని రామనారాయణంను సందర్శించి, అక్కడ నుంచి మేనత్త ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి కనపించకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఫలితం లేకపోవడంతో రూరల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.అశోక్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా విజయనగరంలోని అవనాపువీధికి చెందిన జరజాపు ఫణీంద్ర బుధవారం ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కళాశాలకు వెళ్లడానికి సమయం అవుతున్నా ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే అద్భుత ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ డాక్టర్ కృష్ణారావు

చీపురుపల్లి: పబ్లిక్ పరీక్షలు అనగానే చాలామంది విద్యార్థులు అనవసరమైన భయంతో ఒత్తిడికి గురవుతారని, ఒత్తిడిని అధిగమించినప్పుడే అద్భుత ఫలితాలు సాధించగలుగుతారని అడ్వాన్స్‌డ్ సైకాలజీ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఏ) సైకాలజిస్ట్ డాక్టర్ మిరియాల కృష్ణారావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'విజయీభవ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడాలని సూచించారు. శతశాతం మార్కులు సాధించాలంటే ప్రణాళిక చాలా ముఖ్యమని చెప్పారు. ఏడాది కాలంగా తరగతి గదుల్లో బోధించిన పాఠ్యాంశాలు మాత్రమే పరీక్షల్లో ప్రశ్నలుగా వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రణాళికా బద్ధంగా సాధన చేస్తే చక్కని ఫలితాలు సాధించగలరని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.డి.ఎస్.ఎస్.వి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.